# మమకారం

ఆదూరి వెంకట సీతారామమూర్తి



ఆదివారం పూట వీధిలో వాడి కేక విన్నప్పుడల్లా సుడిగాలికి చుట్టుముట్టేసిన ఎండుటాకుల్లా ఇంట్లోని అక్కరకు రాని కాగితాలన్నీ వెళ్ళిపోయే తొందరలో చుట్టూ పోగవుతాయి. తెల్లారేసరికి ఇంటి ముంగిట వాలి అన్నో ఇన్నో వార్తల్ని వెదజల్లి ఆ రోజుతోనే అస్తమించే న్యూస్ పేపర్లన్నీ రాజకీయ కంపుతో వాడి గోతాంలోకి వెళ్ళడానికే ఉబలాట పడతాయి. మేరువులా పెరిగిపోతున్న పాత పత్రికల ముందు కూర్చుంటే ప్రకటనల మధ్య మంచి రచనల్ని ఏరుకోడం కష్టమైపోతుంది.

నెల క్రితం చదివిందే అయినా దాచుకోదగ్గ రచన కాకపోయినా విసిరిపారెయ్యలేని బలహీనత. నాలుగు మంచి మాటలకోసం కళ్ళద్దాలు సవరించుకొని చూస్తే కవిత్వం ముక్కల్ని అంటించుకుని ప్రపంచ వార్తల్ని మళ్ళీ చెప్పే కవితాకాలాలు అటా ఇటా అని ప్రశ్నిస్తాయి.

ఇంతలో మళ్ళీ వాడి కేక!

పాత పేపర్లూ పాలకవర్లూ పుస్తకాలూ కొంటూ అమ్ముకుంటూ జీవిత చరమాంకంలోకి వచ్చిన వాడిని చూస్తే నిర్వికారంగా చదువుల తల్లిని మోస్తున్న జ్ఞాన పథికుడే అనిపిస్తాడు.

బరువైన మూటను వంగిన దేహంతో మోస్తూ కీళ్ళు జారిన కాళ్ళతో మూడడుగులు చేతికర్రతో ఇల్లిల్లూ పరిచయమున్న వాడిలా తిరుగుతాడు. గుక్కెడు గంజి గుప్పెడు మెతుకుల కోసం శరీరాన్ని నిరంతర శ్రమ సాధనలో ఉంచుతాడు. చూసినవే చూస్తూ తిరగేసినవే మరోమారు తిరగేస్తుంటే ఏర్చి వున్న వాటిల్లో మరికొన్ని అటు వేపు మొగ్గుతాయి. గోనె సంచిలోంచి ధర్మ కాటాని తీసి తాళ్ళతో కర్రముక్కకు కట్టిన రేకు సిబ్బెల్ని పురి విప్పి కేజీ కాగితాల్ని అరకేజీ గుండుతో తూచడానికి ప్రయత్నించే వాడి అవస్థను చూస్తే ఎంతో కొంత ఇచ్చి వెళ్దా అనాలనిపిస్తుంది. అటూ ఇటూ తూచి ఎంతో కొంత చెప్పి చిక్కంలో నలిగిన నోట్లను తీసి సాపుచేసి అందిస్తాడు. మూడు రూపాయలకు కొన్న వార్తా పత్రిక ఏడు రూపాయలకు కొన్న వారపత్రికా మనసు పడి కొన్న మాసపత్రికా కలివిడిగా రూపాయిలో మూడో వంతుకే వాడి వెంట వెళ్ళిపోతుంటే పాత కాగితాలు పోతే పోయాయి. వాటిల్లోని అక్షరాలైనా ఉండిపోకూడదా అనిపిస్తుంది.